

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కుందుర్పి

వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి తనయుడు మారుతీచౌదరి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కనీసం రైతులను పరామర్శించిన పాపానపోలేదన్నారు. వెంటనే పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డికె.రాజన్న, బేల్దారి రామాంజనేయులు, దాసరి గోపీ, అనంతపురం పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి రామ్మూర్తినాయుడు, తెలుగు యువత మండల కన్వీనర్ సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచి నారాయణస్వామి, యువ నాయకులు మల్లికార్జున, జాకీ, శేషాద్రి, నరేష్, నాగభూషణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ పండ్లు తింటే పడకే !!

- ◆పక్వానికి రాకముందే రసాయనాలతో మగ్గిస్తున్న వైనం
- ◆ప్రజల ప్రాణాలతో చెలగాటం ◆పట్టించుకోని అధికారులు



మామిడికాయల్లో రసాయనాల పొడి ఉన్న పొట్లాలు ఉంచిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పక్వానికి రాకముందే పండ్లను కృత్రిమంగా మగ్గించేందుకు రసాయనాలను యథేచ్ఛగా వాడుతున్నారు. ఇలా మగ్గిన పండ్లను తింటే క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు దెబ్బతింటాయని పలువురు వైద్యపరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కృత్రిమంగా పండ్లను మగ్గిపెట్టే పక్రియకు బ్రేక్ వేయాలని హైకోర్టు అనేకసార్లు హెచ్చరించింది. ఈ మేరకు అధికారులను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రసాయనాలతో మగ్గిస్తే రూ.1లక్ష జరిమానాతోపాటు ఐదు సంవత్సరాలు జైలుశిక్ష విధించేలా నిర్ణయించింది. అయితే హై కోర్టు ఆదేశించినప్పుడు అధికార యంత్రాంగం వారం పదిరోజులు హడావుడి చేసింది. రసాయనాలతో మగ్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీలు చేసి కొంతమందిపై కేసులు కూడా పెట్టారు. వ్యాపారులకు రూ.10వేల నుంచి రూ.20వేలు అపరాధ రుసుం విధించారు. తర్వాత పరిస్థితి షరామామూలే అయింది.

ఉమ్మడి జిల్లాలో 1.22 లక్షల హెక్టార్లలో పండ్లతోటలు సాగవుతున్నాయి. రైతులు పండించిన కాయలు పక్వానికి వచ్చినప్పుడుకోత కోసిన కాయలను



అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

వారికి అనుకూలంగా ఉన్నట్లయితే బోదగడ్డి, వరిగడ్డి లేకర్లుగా వేసి మాగించే విధానాలు పాటించాలి. రైతులకు అనుకూలంగా లేకపోతే కాయలను మగ్గించేందుకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రైపనింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. అనంతపురం మార్కెట్ యార్డులో పండ్లు మగ్గించేందుకు మూడు ఛాంబర్స్ ఉన్నాయి కదిరి, గుత్తి, కళ్యాణదుర్గం, మార్కెట్‌యార్డులలో ఒక్కొక్క కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు ఈ విధానంతో పండ్లను మగ్గిస్తే ప్రజలకు ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తవు. రైతులు పండించిన ఉద్యాన ఉత్పత్తులు మామిడి, సపోటా, అరటి, కర్బూజా, పైనాపిల్, బొప్పాయి వంటి వాటికి మగ్గించేదుకు ఈ కేంద్రాలను వినియోగించుకొనే అవకాశాలున్నాయి. కాయలను కోసినప్పుడే పక్వానికి వచ్చిన సమయంలో కోత కోసుకునే విధంగా ఆ శాఖ అధికారులు సలహాలను ఇస్తున్నారు. అవేవి తమకు పట్టవనే ధోరణిలో వ్యాపారులు కొత్త ఫలాలను మార్కెట్‌లోకి తెచ్చి సొమ్ము చేసుకొనే రీతిలో వ్యవహరిస్తున్నారు. కోసిన వాటిని అమ్మిసొమ్ము చేసుకొనేందుకు రసాయనాలు వాడుతున్నారు. పకృతి వైపరీత్యాలు కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో గాలివానలకు పండ్లతోటలు దెబ్బతింటున్నాయి. గాలి వానలకు నేలరాలిపోయిన కాయలను వ్యాపారులు తక్కువ ధరకు కొని వాటికి రసాయనాలు వాడి మగ్గేలా చేస్తున్నారు. మన ప్రాంతాల్లో పండే పండ్లతో పాటు ఇతర ప్రాంతాలలో పండే పండ్లను తెప్పించి రసాయనాల ద్వారా మగ్గిస్తున్నారు. కాశ్మీర్‌నుంచి అట్టపెట్టెల్లో ఆపిల్స్ బెంగళూరుకు వస్తాయి. వాటిని కోనుగోలు చేసుకొని గోడౌన్లలోఉంచుతారు. ఆ పెట్టెలలో చిన్న కార్బైడ్ ముక్క ఉంచి గాలి లోపలికి వెళ్లకుండా చేసి గోడౌన్లలో ఉంచుతారు. 24 గంటల తరువాత ఆపిల్ పెట్టెను తెరిస్తే కాయలు ఆకర్షణీయంగా మంచి రంగుతో కన్పిస్తాయి. మన రాయలసీమ ప్రాంతాల్లో లభించే మామిడి కాయలకు ఇదే పద్ధతే అనుసరిస్తారు. కర్బూజ, బొప్పాయి వంటి వాటి పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. దాదాపు చాలా రకాల పండ్లను ఇలా కృత్రిమంగానే మగ్గిస్తున్నారు. పక్వానికి రాని కాయలను కోసి ఒక్క రోజులోనే పండ్లుగా మార్చే హడావుడిలో హోల్‌సేల్ వ్యాపారులు కృత్రిమ పద్ధతులు పాటిస్తున్నారు. కార్బైడ్స్ ముక్కలను కాగితంలో పొట్లాలుగా కట్టి పండ్ల మధ్యలో పెడితే అవి మగ్గిపోతాయి. అరటి పరిస్థితి అంటే కార్బైడ్స్ అనే రసాయనాన్ని నీటి డ్రమ్ములతో కలిపి అందులో గెలలు మునగనిచ్చి వాటిని గోడానులో వుంచితే అవికూడా మంచి రంగుతో పండి పోతాయి. ఇలా అన్ని రకాల పండ్లను హానికర రసాయనాలతోనే మగ్గిస్తున్నారు. కార్బైడ్స్ నిషేధిత రసాయనమైనా పండ్ల వ్యాపారులకు మార్కెట్‌లో యథేచ్ఛగా లభిస్తుండటం గమనార్హం.

ఈ పండ్లుతింటే రోగాలే....

రసాయనంతో మగ్గిస్తున్న పండ్లను తింటే క్యాన్సర్, మూత్రపిండ, జీర్ణకోశ తదితర వ్యాధుల బారిన పడతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవన్ని తెలిసినా కంటికి ఇంపుగా కనిపిస్తే చాలా కొనుక్కొని తింటున్నాం. తనిఖీ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంఉటన్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో హోల్‌సేల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారుల మీద సరైన చర్యలు తీసుకోకపోవటంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసులు పెడితే వచ్చేలాభం ఏముందన్న ధోరణితో కొందరు అధికారులు మామూళ్లు పుచ్చుకొని వెళుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

నిర్లక్ష్యపు నీడన అధికారులు

రసాయనాలతో పండ్లను మాగించే వారిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు, సీనియర్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు కేసులుపెట్టే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. రసాయనాల ద్వారా పండ్లు మగ్గిస్తే ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5లక్షలు జరిమానా విధించాలని కోర్టు ఆదేశించింది. రెవెన్యూ, పోలీసులు సైతం పండ్లను రసాయనంతో మగ్గిస్తే కేసులు పెట్టవచ్చు. అయినప్పటికి శాఖల మధ్య సమన్వయ లోపంతో, పండ్ల వ్యాపారులపై ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు అందరు కలిసి ఒక్కసారిగా పండ్ల వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేస్తే పెద్ద మాఫియా బయట పడుతుంది.

మణిపూర్‌లో బిక్కుబిక్కు మంటున్న విద్యార్థులు

ఒక్క పూటే భోజనం... రెండు లీటర్లే నీరు

చెర నుంచి విడిపించాలని విద్యార్థుల వేడుకోలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతి వైషమ్యాలతో మణిపూర్ అగ్నిగుండంగా మారింది. వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలతో అక్కడున్న తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కు మంటున్నారు. ఎన్ఐటియు , త్రిపుల్ ఐటి, కేంద్రీయ వ్యవసాయ కళాశాలలో అనేక మంది తెలుగు విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రం నుంచి 157 మంది చదువుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి ఏడుగురు విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. వారితో 'ప్రజాశక్తి' ఫోన్‌లో మాట్లాడింది. ఈ సమయంలో వారి బాధలు కష్టాలను పంచుకుంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నామని విద్యార్థులు తెలిపారు.



మణిపూర్‌లో ఉన్న అనంతపురానికి చెందిన యజ్ఞశ్రీ

ఒక్క పూటే భోజనం... రెండు లీటర్లు నీరు

బయట పరిస్థితి ఉద్రిక్తతంగా ఉంది. బయటకు అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితులున్నాయి. శనివారం రాత్రి కూడా క్యాంపస్ బయట బాంబు పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తాముంటున్న హాస్టల్‌లో రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం లభిస్తోంది. తాగునీటిలోనూ విషం కలుపడంతో నీరు కూడా రావడం లేదు. రోజుకు ఒకటి లేదా రెండు లీటర్లు బాటిళ్లు మాత్రమే అందజేస్తున్నారు. వాటితోనే కాలం గడపాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లోనూ హాస్టల్‌లో లైట్లు అన్నీ బంద్ చేసుకుని అంధకారంలోనే గడుపుతున్నాం. ఇంటర్‌నెట్ సౌకర్యమూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను ఇక్కడి నుంచి బయటకు తీసే ప్రయత్నాలు చేయాలని వేడుకుంటున్నాం.

దినేష్ ఎన్ఐటి ,
పుట్టపర్తి

ప్రభుత్వం తమను స్వస్థలాలకు చేర్చాలి

ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తతంగా ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం అందరిలోనూ ఉంది. స్థానికంగా ఉండే వారు హాస్టళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. బయట నుంచి వచ్చిన వాళ్లమే ఉన్నాం. మా క్యాంపస్‌లో ఉదయం, సాయంత్రం రెండు పూటల మాత్రమే భోజనం దొరుకుతోంది. స్నానాలు చేయడానికి కూడా నీళ్లు లేవు. ఐదు రోజులుగా అలాగే ఉంటున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించి తమను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

బి.సునీల్ నాయక్,
కదిరి

బయట ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయి

మేము ఉంటున్న త్రిపుల్ ఐటి క్యాంప్ ప్రాంతంలో బయట ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. తమ వరకు క్యాంపస్‌లో భోజనం, ఇతర వసతులు సక్రమంగానే అందుతున్నాయి. అయితే బయటకు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. కొద్ది రోజులు ఉంటే అన్నీ సర్దుకుంటాయని యాజమాన్యం చెబుతోంది.

తేజేశ్వరరెడ్డి,
పుట్టపర్తి

ప్రభుత్వం సురక్షితంగా తీసుకురావాలి

మా అమ్మాయి మణిపూర్ ఎన్ఐటిలో సిఎస్సి ఫస్ట్ ఇయర్ చదువుతోంది. నాలుగైదు రోజులుగా అక్కడ జరుగుతున్న హింసాత్మక సంఘటనలతో అక్కడ చదువుతున్న తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సరైన భోజనం వసతి కూడా లేదని చెబుతున్నారు. బయటకు వెళ్లే పరిస్థితులూ లేవు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన విద్యార్థుల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమ పిల్లలను సురక్షితంగా ఇళ్లకు చేర్చే చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నాం.

గుర్రం ప్రతాప్ , యజ్ఞశ్రీ తండ్రి,
అనంతపురం

'చౌక' మోసాలు..!

రేషన్ దుకాణాల్లో కానరాని సూచిక బోర్డులు - అధిక ధరకు పంచదార, కందిపప్పు
అటకెక్కిన ఇంటింటికీ బియ్యం - పట్టించుకోని అధికారులు - ఆందోళనలో కార్డుదారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని చౌకధాన్యం దుకాణాల్లో రేషన్ డీలర్లు మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ధరకు పంచదార, కందిపప్పు విక్రయిస్తున్నారు. దీనికి తోడు దుకాణాల్లో ఎక్కడా ధరల పట్టికగానీ, స్టాకు వివరాలుగానీ కనిపించడం లేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేయాలనే ఉద్దేశంతో ఎంతో ఆర్భాటంగా వాహనాలను సైతం ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.కోట్లు ఖర్చు చేసింది. అయితే అందుకు తగ్గ ఫలితాలు మాత్రం శూన్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాగ్రామాల్లో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలు మూలనబడ్డాయి. చేసేదిలేక రేషన్ దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేస్తున్నారు. మండలవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో డీలర్లు ఎక్కడా నిబంధనలు పాటించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 21,337 రేషన్ కార్డులుగాను 64,663 మందికి 51 చౌకధాన్య దుకాణాలను ఏర్పాటు చేశారు. వీరందరికీ ప్రతినెలా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార పంపణీ చేయాలి. అయితే కందిబేడలు, పంచదారకి మూడు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లు కార్డుదారులు వాపోతున్నారు. ప్రభుత్వం వెబ్‌సైట్ ఆధారంగా గతనెల ఏప్రిల్‌లో కందిపప్పు 16,281 కిలోలు, పంచదార 7,931 కిలోలను ఆయా డీలర్లకు కేటాయించారు. నిబంధనల మేరకు కందిపప్పు పాకెట్‌కు రూ.67, పంచదార (అరకిలో) పాకెట్‌కు రూ.17 వసూలు చేయాలి. కానీ కందిపప్పు రూ.70, పంచదారకు రూ.20 వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. రూ.3 చొప్పున కందిపప్పునకు రూ.48,843, పంచదారకు రూ.23,793ను అదనంగా వసూలు చేస్తున్నారు. ఈలెక్కన నెలకు రూ.72,636, ఏడాదికి సగటున రూ.8,71,632 వసూలు చేస్తున్నారు. పౌరసరఫరా శాఖ నిబంధనల మేరకు ప్రతి చౌకధాన్యం దుకాణం వద్ద స్టాకు వివరాలు, సరుకుల ధరలు, పంపిణీ చేసిన వివరాల ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలి. దీనికితోడు కంప్యూటర్ స్కేల్‌తో తూకాలు వేయాలి. ప్రతి రేషన్ కార్డుదారుడికీ రేషన్ తీసుకున్న తర్వాత తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. అయితే మండలంలో మాత్రం ఈ నిబంధనలను ఎక్కడా పాటించడం లేదు. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పౌరసరఫరా శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రేషన్ తీసుకుంటున్న మహిళ

అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్



ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా వేస్తామని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హిందూపురం పురపాలకసంఘం కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు విడుదల అయిన వెంటనే పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్‌కుమార్ పట్టణ అభివృద్ధిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు మాట్లాడారు.

ప్రజాశక్తి : పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

కమిషనర్ : పట్టణంలో పారిశుధ్యాన్నిమెరుగు పరచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం 80 మంది పర్మినెంట్ కార్మికులు, 220 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగాకార్మికుల సంఖ్య తక్కువగా వుంది. కోవిడ్ సమయంలో మరో 60 మంది కార్మికులను తీసుకున్నాము. వారితో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాము.

ప్ర : పారిశుధ్య మెరుగుకు ఎలాంటి ప్రణాళికలు?

కమిషనర్ : పారిశుధ్య వ్యవస్థ మెరుగు పరచడానికి ప్రణాళికలను రూపొందించుకున్నాం. ఉదయం పూట ప్రధాన రహదారులు శుభ్రం చేస్తే పాదాచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. దీని కోసం నైట్ శానిటేషన్ పనులను ప్రారంభించాం. సచివాలయ వ్యవస్థ రావడంతో అందులో ప్రత్యేకంగా శానిటేషన్ సెక్రటరీని నియమించడంతో నిరంతరం పర్యవేక్షణ చేస్తు పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతాం. దీంతో పాటు మురుగు కాలువల శుభ్రం కోసం అన్ని వార్డుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యహ్నం 1గంట వరకు మేస్త్రీల పర్యవేక్షణలో గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేశాం.

ప్ర : అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కమిషనర్ : పట్టణ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించడానికి కొంత మంది అధికారులను కేటాయించాం. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు 50 గృహాలకు ఒక వాలంటీర్‌ను నియమితులయ్యారు. వాలంటీర్లు వార్డు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిని బిపిఎస్ పథకం ద్వారా సక్రమ కట్టడంగా మారుస్తాం. అందుకు కొన్ని రోజులు సమయం పడుతుంది.

ప్ర : షెడ్ల నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

కమిషనర్ : పురపాలక సంఘంలో వారి సొంత స్థలాలలో పక్కా భవనాలు కట్టుకోవడానికి అనుమతులు అవసరమవుతాయి. వారి స్థలంలో తాత్కాలికంగా ప్రహరీ, షెడ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు అవసరం వుండదు. అయినప్పటికి పట్టణ వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో వెలసిన షెడ్ల నిర్మాణాలపై తనిఖీలు నిర్వహించి ఆ షెడ్లు దేనికి వాడుతున్నారని పరిశీలించి నిబంధనల మేరకు వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర : అభివృద్ధి పనులపై ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?

కమిషనర్ : పట్టణంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నది వాస్తవం. ఇప్పటికే గుత్తేదారులతో అభివృద్ధి పనులపై సమీక్షించాం. దీంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు, ఇతర నిధుల గురించి స్థానిక ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు వివరించి, ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం.

ప్ర : పెండింగ్ బిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కమిషనర్: నిధులు లేకపోవడంతో బిల్లుల మంజూరు అలస్యం అవుతోంది. దినివల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో పాటు గుత్తేదారులతో ఇప్పటికే మాట్లాడాము. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు జరిగే విధంగా చర్యలు తీసుకోంటామని చెప్పడంతో గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు వస్తున్నారు.

ప్ర : వీధిజంతువుల సమస్యను ఎలా పరిష్కరిస్తారు ?

కమిషనర్ : కుక్కలు, పందులు, ఆవులు, కోతులు పెద్ద సమస్యగా మారాయి. ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక సిబ్బందిని పిలిపించి, వారితో కుక్కలు, కోతులు పట్టిస్తున్నాం. ఆవులను గోశాలకు తరలిస్తున్నాం. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులకు సంబందించిన యజమానులకు జరిమానాలు విధిస్తున్నాం. పందులు తరలించేందుకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. అయినా వాటిని ఇతర రాష్ట్రాలకు తరలించే చర్యలు తీసుకుంటున్నాం.



హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్ర : క్లాప్ కార్యక్రమం ఎంత వరకు అమలు చేస్తున్నారు ?

కమిషనర్: హిందూపురం పురపాలక సంఘంలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) దిశగా అడుగులు వేస్తున్నాం. ఇప్పటికే అన్ని వార్డులలో ప్రజలకు ఇంటికి మూడు బుట్టలను అందించి, ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. చెత్త సేకరణ అనంతరం చెత్త సేకరించినట్లు ఇంటి యజమానుల సంతకాలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించాం. మరో మూడు నెలల్లో క్లీన్ హిందూపురం లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగుతున్నాం.

ప్ర : ప్లాస్టిక్ నిషేధంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కమిషనర్ : హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. దీని కోసం సచివాలయాల వారిగా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశాం. కమిటీల ద్వారా తనఖీలు ముమ్మరం చేస్తున్నాం.

ప్ర : కౌన్సిల్ సహకారం ఎలా ఉంది ?

కమిషనర్: నూతనంగా బాధ్యతలు స్వీకరించా. పార్టీలకు అతీతంగా అన్ని వార్డు కౌన్సిలర్లను కలుపుకుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఒక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తా.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్. గేయానంద్

చదువుతోపాటు సామాజిక అవగాహన అవసరం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ - అనంత చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లలకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదితరులతో కలిసి సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లల కోసం సమ్మర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల, చుట్టుపక్కల వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వేసవిలో ఇలాంటి క్యాంపు ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాలలో పోటీతత్వం ఉన్నట్లే చదువులో కూడా వచ్చిందన్నారు. అందుకోసం పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి మార్కులతో పాస్ అవ్వాలని నిరంతరం పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. దీని వల్ల చదువు తప్ప వేరే ఆలోచన పిల్లలకు రావడం లేదన్నారు. దీని వల్ల పిల్లలలో నైపుణ్యత, సృజనాత్మకత లేకుండా పోతుందన్నారు. ఈ క్యాంపులో పిల్లలకు ఉపయోగపడేలా 20 రకాల ఈవెంట్స్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ క్యాంపు నిర్వహిస్తున్న క్లబ్స్ మెంబర్స్‌ను అభినందించారు. అనంత చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ నరసింహారెడ్డి, కో కన్వీనర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాన్స్‌మాస్టర్ కుళ్లాయి స్వామి, విజ్ఞానకేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఆఫీస్ కార్యదర్శి సురేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఖజీబి, గౌతమి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

104 ఉద్యోగుల సమస్యలపై నేటి నుంచి నిరసనలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

104 ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఏసి జిల్లా అధ్యక్షులు కె.విజయ్, 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. ఈమేరకు ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 104 ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఇచ్చిన కార్యాచరణ అమలులో భాగంగా నేటి నుంచి నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. 104ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఫుడ్ అలివెన్స్, ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. బదిలీల సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగులు యాజమాన్య ప్రతినిధులతో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. 8 నుంచి 14వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో 104 యూనియన్ నాయకులు డీకే మల్లికార్జున, తిప్పేరుద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలకుడు దామోదరం సంజీవయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

దళిత, గిరిజనులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఆదర్శ పరిపాలకుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బ్యాక్ వర్డ్ క్లాసెస్ అండ్ మైనార్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కొనియడారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో మైనార్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు ప్రకటించి జయంతి వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బ్యాక్ వర్డ్ క్లాసెస్ అండ్ మైనారిటీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వంకరాజుకాలవ గోవిందరాజులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.గోవిందు, సి.మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు వలిగొండ రామకృష్ణ, ఎం.జయరాముడు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కోటి మల్లేష, వై.భైరవకుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీలు సాకే వెంకటరమణ, యస్.మహమ్మద్ రఫీ, బి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు రావడం సంతోషం

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్చం అందజేస్తున్న డిఇఒ సాయిరాం

పదో ఫలితాల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఈమేరకు పదో తరగతి ఫలితాలు విడుదలైన సందర్భంగా శనివారం రాత్రి జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.సాయిరాం కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేసి పూర్తి వివరాలను నివేదించారు. జిల్లావ్యాప్తంగా 29,666 మంది విద్యార్థులకు 19,654 మంది విద్యార్థులు పాసై 66.25 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లాకు 20వ స్థానం వచ్చినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ గతేడాది కంటే ఈసారి ఫలితాలు మెరుగుపరడం సంతోషకరమన్నారు. కాగా ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ పాసయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైసిపి హయాంలో భ్రష్టుపట్టిన తాడిపత్రి

అధికారంలోకి వస్తే గన్నెవారిపల్లిలో అండర్ డ్రెయినేజీ : తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వైసిపి అధికారంలోకి వచ్చాక తాడిపత్రి నియోజకవర్గం భ్రష్టుపట్టిందని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయతీలో ఆదివారం పర్యటించిన జెసి ప్రభాకర్‌రెడ్డి నాయీబ్రాహ్మణ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం తాడిపత్రి భ్రష్టు పట్టిందని, ప్రజలు కళ్లు తెరిస్తే త్వరలో తాము అధికారంలోకి వస్తామన్నారు. అప్పుడు తాడిపత్రితోపాటు గన్నెవారిపల్లి పంచాయతీలో అండర్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా మూతబడిన నల్లబండల పరిశ్రమలను తెరిపిస్తామన్నారు. ఇక్కడ ప్రస్తుతం సర్పంచిగా ఉన్న వ్యక్తి డ్రెయినేజీ వేయడానికి ప్రయత్నం చేయగా ఇఒఆర్‌డి అధికార పార్టీ చెప్పినట్లు చెక్ పవర్‌ను రద్దు చేశారన్నారు. అయితే పోరాడి తిరిగి చెక్ పవర్ పొందారన్నారు. అదేవిధంగా గతంలో పని చేసిన డీఎస్పీ బదిలీ కావడంతో తాడిపత్రి ప్రశాంతంగా ఉందన్నారు. ప్రజలందరూ గమనించి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన పది కుటుంబాలు జెసి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో గన్నెవారిపల్లి సర్పంచి ఉమామహేశ్వర్, టిడిపి నాయకులు చింబిలి వెంకటరమణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు అభినందన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

నార్పల : శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎపిఆర్ఎస్ ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల ట్రస్టు నిర్వాహకులు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్ 16న నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బిసి వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా శిక్షణ తీసుకున్న వారిలో ఏడుగురు విద్యార్థులకు సీట్లు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు లగినేని నాగరాజు, కుళ్లాయప్ప, ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, తదితరులు అభినందించారు.

విగ్రహాల ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే శివరారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

బెలుగుప్ప : మండల కేంద్రంలో వెలసిన ఆలయంలో వెలగల్లేశ్వరస్వామి, యల్లమ్మ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా తెల్లవారుజామున బెలగల్లేశ్వరస్వామి, యల్లమ్మ స్వాములకు వేద పండితులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్టించారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, జడ్పిటిసి మమత త్రిలోకనాథ్‌రెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మిషన్ కమిటీ సభ్యులు రాజారాం, రమణ, అధ్యక్షులు శివలింగప్ప, గుద్దేకుంట రామాంజనేయులు, ఉపాధ్యాయులు ఈశ్వరప్ప, బోయ వెంకటేశులు, బీసీ మోహన్, జీడిపల్లి రాజు, రఫీ, పరమేశ్వరప్ప, కల్లప్ప, బసవరాజు, బిహెచ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



అల్లూరికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

దేశం గర్వించదగిన గొప్ప పోరాటయోధుడని మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు అని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ పరిధిలోని సిపిఎం కొత్తకాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్య్రం సాధించడం కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎదురించి పోరాడిన నాయకుడు అల్లూరి అన్నారు. గిరిజన బిడ్డలను ఐక్యం చేసి పోరాటం సాగించి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసిన వీరుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు పేరు చెపితేనే నేటితరం యువతరానికి ఎంతో ఉత్తేజాన్ని, పోరాట శక్తి కలిగిస్తాయని తెలిపారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తితో నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్ రెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు శివ, మోహన్, వలి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బూదిగుమ్మ సమీపంలో రూ.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

మండలంలోని బూదిగుమ్మ సమీపంలో రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలు దెబ్బతిన్న బ్రిడ్జి నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బెలగలేశ్వరస్వామి, యల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రిజర్వాయర్ నీటితో బూదిగుమ్మ సమీపంలో బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకులకు అంతరాయం ఏర్పడి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వెంటనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా గుంతకల్లు నుంచి ఉరవకొండ, బెలుగుప్ప, కళ్యాణదుర్గం మీదుగా కర్ణాటక రాష్ట్రం పావుగడకు జాతీయ రహదారిని అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సహాయ కేంద్ర రైల్వే శాఖ నుంచి గుంతకల్లు, ఉరవకొండ, బెలుగుప్ప, కళ్యాణదుర్గం లింకు రైల్వే రోడ్డు కలపనున్నట్లు తెలిపారు. కాగా సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు రమణ, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, బోయ వెంకటేశులు, బీసీ మోహన్, రామాంజనేయులురెడ్డి, పరమేశ్వర్, గుండ్లపల్లి అంజన్‌రెడ్డి, జీడిపల్లి రాజు, రఫీ, మస్తాన్, బసవరాజు, సోంపల్లి ఎర్రిస్వామి, గంగ్యానాయక్, బిహెచ్ చౌదరి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం



రాయదుర్గంలోని ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

రాయదుర్గం సర్వజన ప్రాంతీయ ఆసుపత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక ఆసుపత్రి ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపరింటెండెంట్ వరప్రసాద్ ఆసుపత్రిలో హిట్లర్‌లా వ్యవహరిస్తున్నాడన్నారు. ఆసుపత్రి తన సొంత ఇంటిగా మార్చుకుని ఆసుపత్రిలో చేయలేని పనులను చేయిస్తున్నాడని వాపోయారు. ముఖ్యంగా మహిళా వైద్యులు, కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారంగా దుర్భాషలాడుతున్నాడన్నారు. ఆయన మాట వినకపోతే కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నాడని మండిపడ్డారు. రాత్రి వేళల్లో ఈ అధికారికి కార్మికులు దగ్గరుండి సపర్యాలు చేయాల్సి వస్తోందన్నారు. చేయకపోతే కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. ఈయన తీరుతో కార్మికులు మనోవేదనకు గురై తమ బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక కుంగిపోతున్నారన్నారు. అనంతరం డాక్టర్ మాధవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు డాక్టర్ స్పందిస్తూ సమస్యలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే జిల్లా వైద్యాధికారులు స్పందించి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మధు, శంకర్, తిమ్మరాజు, కృష్ణానాయక్, నాగేంద్రనాయక్, తిప్పేస్వామి, అంజి, నాగేంద్ర, మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, కేశవ, మల్లికార్జున, బొమ్మన, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గఫూర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అనంతపురం



ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

40 ఏళ్ల నుంచి ముస్లిములకు డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. శనివారం నగరంలోని పాతవురులో గఫూర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ఖత్నా (ఒడుగులు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ కెఎస్ఎ ఆర్ గఫూర్ ఆసుపత్రి, జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం ఛైర్మన్ డాక్టర్ కెఎస్ అబ్దుల్ రజాక్ గఫూర్, డాక్టర్ కెఎస్ అర్షద్ ఆయూబ్ గఫూర్ సంయుక్తంగా కలిసి 250 మంది ముస్లిం పిల్లలకు ఉచితంగా ఒడుగులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ మైనార్టీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఎనలేని సేవలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మొహమ్మద్ వసీం, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్ బాషా, రచయిత సంఘం సభ్యులు కంబుదూరి నబిరసూలు, ఇస్లామిక్ సొసైటీ సభ్యులు ఖాసీం, గఫూర్ ఆసుపత్రి సిబ్బంది రాజు, భరత్, షాహుల్, ఐఎంఎం ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులుగా ఓబులేసు



కణేకల్లు : మండల కేంద్రానికి చెందిన టిడిపి యువ నాయకుడు ఓబులేసును నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడిగా నియమించినందుకు టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఈనెల 16న విజయవాడ టిడిపి కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. తన కష్టాన్ని గుర్తించి పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, వాల్మీకి, బోయ సాధికార సమితి రాష్ట్ర కమిటీ మెంబర్ సుదర్శన్, నాగేశ్వరావు, వైద్య శాంతం, రామకృష్ణ, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

రైతుల పరిస్థితి దారుణం

శింగనమల : రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి నాయకులు రైతులకు చేసింది శూన్యమన్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆఖరికి పరామర్శించిన పాపానపోలేదన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వరి, చీనీ, మొక్కజొన్న, అరటి, దానిమ్మ, బొప్పాయి వంటి అనేక పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రైతుల కోసం తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలు భక్షక కేంద్రాలుగా మారామని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి పంటలు నష్టపోయిన రైతులందరికీ పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి యస్.జయరాములు కోరారు. ఈమేరకు ఆదివారం స్థానిక గ్రంథాలయంలో సర్పంచి రామిగాళ్ల ఓబులేసుతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయంలో వివిధ రకాల సైన్స్, క్విజ్, చరిత్ర గల పుస్తకాలు ఉంటాయన్నారు. పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

డి.హీరేహాల్ : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకూ సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఉషారాణి తెలిపారు. ఈమేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకర్, గిరిజాపతితో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో సమయం వృథా చేసుకోకుండా పరిజ్ఞానాన్ని పెంచడం కోసం ప్రభుత్వం వేసవి శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. వీటిని విద్యార్థులతోపాటు యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

అనంతపురం : అశోక్‌నగర్‌లోని సరస్వతీ విద్యామందిరంలో శనివారం పట్టణ ఆవోపా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కుల, మత భేద రహితంగా వ్యక్తిత్వ వికాస అభ్యాసన శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్మయా మిషన్ ఇన్‌ఛార్జి స్వామి ఆత్మ విధానంద మానవతా విలువలు, సామాజిక బాధ్యతపై విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి, ఇంపాక్ట్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి, పట్టణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు జయంతి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు చంద్రమోహన్‌గుప్తా, కార్యదర్శి గోపనపల్లి కృష్ణయ్య, కోశాధికారి ఫణి భూషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండల పరిధిలోని చాలివేముల గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు రాతిదూలం పోటీలు

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లె గ్రామంలో అంకాలమ్మ తల్లి జాతర సందర్భంగా సోమవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు మొరం ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనాలనుకునేవారు సోమవారం ఉదయం ఆరు గంటలలోపు టోకెన్ తీసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, 2వ బహుమతి రూ.40వేలు, 3వ బహుమతి రూ.30వేలు, 4వ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.15వేలు, 6వ బహుమతి రూ.12వేలు, 7వ బహుమతి రూ.10వేలు, 8వ బహుమతి రూ.8వేలు, 9వ బహుమతి రూ.5వేలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

'టెన్త్'లో మౌర్య స్కూల్ ప్రభంజనం



హర్షిత 575

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో ఉన్న మౌర్య పాఠశాల విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన హర్షిత 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల అధినేత ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుంచి తమ పాఠశాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా టాపర్లుగా నిలుస్తూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

గుత్తి ఎస్ఐగా రామకృష్ణారెడ్డి



గుత్తి : గుత్తి నూతన ఎస్ఐగా రామకృష్ణారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుత్తి మండలానికి గతంలో ఇద్దరు ఎస్ఐలు, ఒక ట్రాఫిక్ ఎస్ఐ విధులు నిర్వహించేవారు. అయితే కొంతకాలంగా ఒక ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు మాత్రమే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు మండలానికి మరో ఎస్ఐని నియమిస్తూ ఆదేశాలు చేయడంతో డి.హీరేహల్‌లో పని చేస్తున్న ఎస్ఐ రామకృష్ణారెడ్డి బదిలీపై గుత్తికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

మాయావతి సభకు తరలిన బీఎస్పీ నాయకులు

గుత్తి : హైదరాబాదులో తెలంగాణ బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి వస్తుండటంతో గుత్తి నుంచి బీఎస్పీ నాయకులు ఆదివారం పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం మాట్లాడుతూ భవిష్యత్తులో బహుజనుల రాజ్యస్థాపన జరగబోతుందన్నారు. హైదరాబాదులోని సరూర్ నగర్‌లో జరిగే బహిరంగ సభకు యూపీ మాజీ ముఖ్యమంత్రి, బహుజన్ సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షురాలు మాయావతి బహిరంగ సభ హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. ఈకార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం విజయ్, కన్వీనర్ బి.వెంకటకొండయ్య, నాయకులు ఎం.రామాంజనేయులు, ఎం.రంగనాయకులు, కె.నాగేశ్వరరావు, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనాథ, వృద్ధాశ్రమాల్లో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

గుత్తి : ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కుమార్తె, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలోని స్వీట్ సేవియర్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన అనాథ, వృద్ధాశ్రమాల్లో ఆదివారం అన్నదానం చేశారు. ముందుగా వైసిపి సీనియర్ నాయకులు వై.రామసుబ్బారెడ్డి, మిత్రబృందం ఆధ్వర్యంలో కేక్ కోసం వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెల్ బాషా, మురళి, ఇమ్రాన్, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్లు ఇవ్వాలి

గుత్తి : ప్రతినెలా 1వ తేదీనే ప్రభుత్వ పెన్షనర్లకు పింఛన్ ఇవ్వాలని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. వారికి వచ్చే పింఛన్ సొమ్ముతోనే వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం 8వ తేదీ వచ్చినా పింఛన్లు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి సకాలంలో పింఛన్లు చెల్లించి విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

యాడికి : మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో ఉన్న స్టార్ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ప్రసూతి, స్త్రీల వైద్య నిపుణులు మంజుల జనరల్ వైద్య నిపుణులు భరత్‌కుమార్, వైద్య బృందం దాదాపు 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో కొంతమందికి రక్త పరీక్షలు, మహిళలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా వారంలో ప్రతి గురువారం ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు మంజుల అందుబాటులో ఉంటారని స్టార్ ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. అలాగే స్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఉచితంగా ఖాత్నా (ఒడుగులు) చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, వైసిపి మండల నాయకులు బాల రమేష్‌బాబు, స్టార్ ఆసుపత్రి యాజమాన్యం డిపో రాజు రంగస్వామి, ఇలాహీ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతు వాహనంపై శ్రీవారు



హనుంతువాహనంపై విహరిస్తున్న పెన్నోబిలేసుడు

ఉరవకొండ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆదివారం సాయంత్రం హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను హనుమంతు వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్, బాలాజీ, గుండురావు, ఉత్సవదాతలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పదిమందికి గాయాలు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణం నుంచి బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్తున్న టాటా ఏస్ ఆటో బోల్తా పడటంతో 10 మందికి గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 20 మందితో ప్రమాణిస్తున్న టాటా ఏస్ ఆటో రాయదుర్గం నుంచి గొంచిరెడ్డిపల్లి వెళ్తుండగా స్థానిక మోడల్ కాలనీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో దాదాపు 10 మంది గాయాలపాలయ్యారు. వీరిలో గొల్ల తిమ్మప్ప అనే వ్యక్తికి రెండు కాళ్లు విరిగాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిమ్మప్ప, మరి కొంతమందిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.